జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
మంగళవారం 03 నవంబర్ 2026 పేజీలు:09




మృతిచెందిన హోంగార్డుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

- ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున చెక్కులు అందజేసిన జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు

గద్వాల నవంబర్ 02(ప్రజా జ్యోతి ప్రతినిధి):

విధి నిర్వహణలో ఉండగా మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు అన్నారు.

మిగతా 2 లో



కృష్ణా జలాలు ఏపీకి..
పాలమూరుకు కరువు!

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే పంటలు ఎండిపోతున్నాయి: మాజీ మంత్రి హరీశ్‌రావు
- రైతుల గోస.. కాంగ్రెస్‌కు పట్టదా? : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి
- అల్వాలలో రైతన్నల రణబేరి సభ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి ధ్వజం..
- బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



వనపర్తి ప్రతినిధి, నవంబరు 2 (ప్రజాజ్యోతి):

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం, సాగునీరు, విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం కారణంగానే రైతుల పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు విమర్శించారు. కృష్ణా జలాలు పాలమూరు పొలాలకు చేరాల్సి ఉండగా ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోతున్నాయని ఆరోపించారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతన్నల రణబేరి' సభలో ఆయన మాట్లాడారు.

మిగతా 2 లో



ఎల్ నినోపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

- రబీ సీజన్‌లో ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి
- నీరు,విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి



గద్వాల నవంబర్ 02(ప్రజా జ్యోతి ప్రతినిధి):

ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే నీటి కొరతపై ప్రజలందరికీ విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.నీటి సంరక్షణ,పొదుపు చర్యలపై సాంస్కృతిక సారథి కళాకారులు తమ పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని,ఇదే అంశంపై రూపొందించిన షార్ట్ ఫిలింను కూడా సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.ఉండవల్లి మండలం కంచుపాడు గ్రామానికి చెందిన ఔత్సాహిక షార్ట్ ఫిలిం దర్శకుడు శేషు ఎల్ నినో ప్రభావంపై రూపొందించిన షార్ట్ ఫిలింను సోమవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో విడుదల చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఈ షార్ట్ ఫిలింను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ఉన్నతాధికారులకు కూడా పంపించాలని,తద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో విస్తృత ప్రచారం కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

మిగతా 2 లో

ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మంగళవారం 03 నవంబర్ 2026

ఖేలో ఇండియా కబడ్డీ పోటీలకు సన్నాహాలు షురూ!

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి.. ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలి:

అదనపు కలెక్టర్ డి. మధుసూధన్ నాయక్

మహబూబ్‌నగర్, నవంబర్ 2 (ప్రజా జ్యోతి బ్యూరో):

మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న ఖేలో ఇండియా (కబడ్డీ) క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డి. మధుసూధన్ నాయక్, ఐఏఎస్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పోటీల ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన క్రీడా వేదిక, మౌలిక సదుపాయాలు, విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.క్రీడా పోటీలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. క్రీడాకారులకు, విధులు నిర్వహించే అధికారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లన్నింటినీ ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో క్రీడా వాతావరణాన్ని ప్రోత్సహించడంతో పాటు యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించే ఇటువంటి పోటీల నిర్వహణకు ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా సంక్షేమ అధికారులు, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి, విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణా జలాలు ఏపీకి.. పాలమూరుకు కరువు!

మొదటిపేజీ తరువాయి

సభకు ముందు సాగునీరు అందక ఎండిపోయిన వరి పంటలను హరీశ్‌రావు, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరిశీలించారు. రైతులు కొండన్న 3.5 ఎకరాలు, ఆశన్న 6 ఎకరాల్లో సాగు చేసిన వరి పంట పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా, సాగునీటి సమస్యలను వివరించి పంట నష్టానికి పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. అనంతరం రైతన్నల రణబేరి సభలో మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని ఎత్తిపోయడానికి అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం సక్రమంగా వినియోగించుకోవడం లేదని విమర్శించారు. మోటార్లను పూర్తిస్థాయిలో నడపకపోవడం, సాగునీరు అందించకపోవడంతో పాలమూరులో మళ్లీ కరువు పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో సాగునీరు, విద్యుత్‌కు ప్రాధాన్యమిచ్చామని పేర్కొన్నారు. చెక్‌డ్యాంలు, పెండింగ్ ప్రాజెక్టులు, రిజర్వాయర్ల నిర్మాణాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కరువు మండలాల ప్రకటనతో సరిపెట్టకుండా పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.





రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

కృష్ణా జలాలను సద్వినియోగం చేసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మంత్రి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. నదిలో నీరున్నా రైతుల పొలాలకు చేరకపోవడం బాధాకరమన్నారు. గతంలో వనపర్తి జిల్లాను వరి సాగులో రాష్ట్రంలోనే ముందంజలో నిలిపామని, నేడు పంటలు ఎండిపోతుండటం ఆవేదన కలిగిస్తోందన్నారు. యూరియా కోసం రైతులు ప్రతి సీజన్‌లో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. అదే విధంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు చేశారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతులు ఇబ్బందుల్లో ఉన్నందున వారికి తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు సభ అనంతరం వివిధ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, వారి అనుచరులు బీఆర్ఎస్‌లో చేరారు. ఎదుల మాజీ సర్పంచ్ జిల్లెల శ్రీనివాస్‌రెడ్డి 200 మంది అనుచరులతో, దత్తాయపల్లి సర్పంచ్ దేవేందర్‌నాయుడు, మాజీ సర్పంచ్ రాజునాయక్ తన అనుచరులు, మాజీ కౌన్సిలర్ లక్ష్మీదేవమ్మ, ఆమె కుమారుడు రామాలయం వినోద్ గౌడ్, శివ గౌడ్ కూడా తమ అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. వారికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో, హరీశ్‌రావు సమక్షంలో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, అంజయ్యాదవ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, గద్వాల బీఆర్ఎస్ ఇన్‌చార్జి బాస్ హనుమంతునాయుడు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఇంతియాజ్, వాల్యానాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, రజినీ సాయిచంద్, మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పలుస రమేష్ గౌడ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ప్రేమనాథ్ రెడ్డి, జిల్లా నాయకులు, మండల నాయకులు, పట్టణ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినోపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో నీటి సంరక్షణపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.రబీ సీజన్‌లో రైతులు తమ బోర్లు,బావుల్లో అందుబాటులో ఉన్న నీటి లభ్యతను బట్టి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు.ముఖ్యంగా పప్పుధాన్యాలు,కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు.స్ప్రింక్లర్లు,డ్రిప్ ఇరిగేషన్ విధానాలను వినియోగించడం ద్వారా తక్కువ నీటితోనే పంటలను సాగు చేయవచ్చన్నారు.నీటిని పునర్వినియోగించే పద్ధతులను అలవర్చుకోవాలని,ఇంట్లో వినియోగించిన నీటిని పెరటి తోటల్లోని మొక్కలకు ఉపయోగించుకోవాలని సూచించారు.ప్రతి ఇంటి వద్ద వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు చిన్న సంపులు ఏర్పాటు చేసుకోవడంతో పాటు,ఇతర మార్గాల్లో వర్షపు నీటిని సేకరించి గృహ అవసరాలకు వినియోగించుకోవాలని తెలిపారు.వీబీ-జీ రామ్‌జీ పథకంలో భాగంగా జలసిరి కార్యక్రమాల ద్వారా పంట కుంటలు,ఇంకుడు గుంతల నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలని అధికారులను ఆదేశించారు.తద్వారా భూగర్భ జలాల పెంపునకు అవకాశం ఉంటుందన్నారు.నీటితో పాటు విద్యుత్‌ను కూడా పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.జూలై వరకు ఎల్ నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రానున్న కాలంలో నీరు,విద్యుత్ కొరతను అధిగమించేందుకు ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.ఎల్ నినో ప్రభావంతో రానున్న ఎనిమిది నెలల పాటు ఎదురయ్యే నీటి కొరతను అధిగమించేందుకు ఇటువంటి షార్ట్ ఫిలింలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొంటూ చిత్ర రూపకర్తలను కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప,ఉద్యానవన అధికారి రాజ్‌కుమార్,షార్ట్ ఫిలిం నిర్మాణానికి సహకరించిన లక్ష్మణ్,శేషన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మృతిచెందిన హోంగార్డుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

మొదటిపేజీ తరువాయి

సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో 2025లో అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు ఏ.స్వాములు,2024లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డు కె.ధన్‌రాజ్ రాథోడ్ కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా నిధుల కింద ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.10 లక్షల చెక్కులను ఎస్పీ అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.మృతిచెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం,పోలీసు శాఖ ద్వారా అందాల్సిన సంక్షేమ ప్రయోజనాలు సకాలంలో అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని పేర్కొన్నారు.మృతుల కుటుంబాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వారికి అందాల్సిన మిగిలిన సంక్షేమ ప్రయోజనాలను కూడా త్వరితగతిన అందించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమం పట్ల పోలీసు శాఖ నిరంతరం బాధ్యతతో వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలన అధికారి సాయికృష్ణ, ఆర్ఐ వెంకట్,మృతిచెందిన హోంగార్డు స్వాములు కుటుంబ సభ్యురాలు కళావతి,ధన్‌రాజ్ రాథోడ్ భార్య భావన, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు హక్కుపై అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

- ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు







ఆలంపూర్ నవంబర్ 2

(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తాలోని కన్వెన్షన్‌లో మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు నమోదు పై నిర్వహించిన అవగాహన సదస్సు విజయవంతంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి , అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి , ఎమ్మెల్యే విజయుడు స్వయంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రాధాన్యత, ఓటు హక్కు నమోదు విధానం, ఓటరుగా నమోదు కావడానికి ఉండాల్సిన అర్హతలు, అవసరమైన ధ్రువపత్రాలు, దరఖాస్తు ప్రక్రియ తదితర అంశాలను వివరించి పట్టభద్రులకు అవగాహన కల్పించారు.అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, చేపట్టిన పథకాల అమలులో వైఫల్యాలపై నాయకులు విమర్శలు చేశారు.అలాగే అలంపూర్ నియోజకవర్గంలో రైతుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారంటూ వసూలు రాజా వ్యవహారంపై వారు ప్రస్తావించారు. అదేవిధంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఎవరికీ డబ్బులు ఇచ్చి మోసపోవద్దని, ఇలాంటి వసూళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అలంపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ఎంపీపీలు మాజీ జెడ్పీటీసిలు మాజీ సర్పంచులు మాజీ ఉపసర్పంచ్లు మాజీ వార్డు సభ్యులు,బీఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో 17 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ

గద్వాల నవంబర్ 02(ప్రజా జ్యోతి ప్రతినిధి):

ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి, బాధితులకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తెలిపారు.ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 17 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు.ఆయా ఫిర్యాదులకు సంబంధించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి,సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు,వారి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడమే ప్రజావాణి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు,సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని,వారి ఫిర్యాదులను సానుకూలంగా స్వీకరించాలని సూచించారు.అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం, భరోసా పెంపొందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు.ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి,వాటి పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని ఎస్పీ తెలిపారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ కార్యక్రమం మంచి వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు.సోమవారం స్వీకరించిన 17 ఫిర్యాదుల్లో ప్లాట్ల ఆక్రమణకు సంబంధించి 3,భూ వివాదాలకు సంబంధించి 6,భర్త వేధింపులకు



సంబంధించి 1,గొడవలకు సంబంధించి 2, మోసం (చీటింగ్)కు సంబంధించి 2,ఇతర సమస్యలకు సంబంధించి 3 ఫిర్యాదులు ఉన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ మొగిలయ్యతో పాటు అలంపూర్, గద్వాల,శాంతినగర్ సర్కిల్ అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునే పంటలు సాగు చేయాలి

'ఖేత్ బచావో' కార్యక్రమంలో రైతులకు

అవగాహన కల్పించిన డా.పి.ఆర్చన

గద్వాల నవంబర్ 02(ప్రజా జ్యోతి ప్రతినిధి):

జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఆరగిద్ద గ్రామంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'ఖేత్ బచావో' కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బి.ఆర్.వి.కె జోగులాంబ గద్వాల కోఆర్డినేటర్ డా.పి.ఆర్చన పాల్గొని





రైతులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు,రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో సంభవించే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అధిక నీటి అవసరం కలిగిన వరి,మొక్కజొన్న పంటలకు బదులుగా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జొన్న,ఉలవలు,అలసందలు, వేరుశనగ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు.రానున్న జూలై 2027 వరకు ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీరు,విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు.పంటలకు అవసరమైన మేరకే సాగునీటిని వినియోగిస్తూ నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని వివరించారు.వాతావరణ మార్పులను తట్టుకునే పంటల సాగు విధానాలను అనుసరించడం ద్వారా వ్యవసాయంలో పెట్టుబడులు, నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గట్టు మండల వ్యవసాయ అధికారి హనుమంతు,ఆరగిద్ద వ్యవసాయ విస్తరణ అధికారి (ఆత్మ) ప్రతినిధి,గ్రామ సర్పంచ్,పంచాయతీ కార్యదర్శి,రైతులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యమే లక్ష్యం.. నట్టల నివారణకు ప్రత్యేక కార్యక్రమం!

- నవంబర్ 2 నుంచి 7 వరకు జిల్లా వ్యాప్తంగా మందుల పంపిణీ

మహబూబ్‌నగర్, నవంబర్ 2 (ప్రజా జ్యోతి బ్యూరో):

పశుసంపద అభివృద్ధికి పశువుల ఆరోగ్య పరిరక్షణ ఎంతో కీలకమని గుర్తించిన జిల్లా పశుసంవర్ధక శాఖ పశువులకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నవంబర్ 2 నుంచి 7వ తేదీ వరకు వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని





నిర్వహించనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం మూసాపేట మండలం పొల్కంపల్లి గ్రామంలో జిల్లా పశుసంవర్ధక అధికారి శివానంద స్వామి పశువులకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల్లో నట్టల సమస్య కారణంగా వాటి ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా పాల ఉత్పత్తి తగ్గడం, ఎదుగుదల మందగించడం, తీసుకున్న ఆహారంలోని పోషకాలను గ్రహించే సామర్థ్యం తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. సకాలంలో నట్టల నివారణ మందులు వేయించడం ద్వారా పశువులను ఆరోగ్యంగా ఉంచడంతో పాటు పశుపోషకులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. పశుపోషకులు నిర్లక్ష్యం చేయకుండా పశువైద్య సిబ్బంది సూచనల మేరకు సరైన మోతాదులో మందులు వేయించాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించనున్నందున ప్రతి పశుపోషకుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పొల్కంపల్లి గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరీతో పాటు పలువురు స్థానికులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత కిసాన్ మహాసభలను విజయవంతం చేయండి

- రైతు సంఘం

జిల్లా అధ్యక్షులు దేశ్యనాయక్

నాగర్ కర్నూల్ నవంబర్ 2 (ప్రజా జ్యోతి బ్యూరో)

అఖిల భారత కిసాన్ సభ ఆల్ ఇండియా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ప్రజలకు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దేశ్యనాయక్పిలుపునిచ్చారు సోమవారం సిఐటియు కార్యాలయంలో రైతు సంఘం మహాసభల కరపత్రాలను విడుదల చేశారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు దేశ్యనాయక్ గారు మాట్లాడుతూ... అఖిలభారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలు నల్లగొండ పట్టణంలో నవంబర్ 15 16 17 18 తేదీల్లో జరగనున్నాయని 15వ తేదీన లక్షలాది ప్రజలతో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని వారు అన్నారు ఈ సభలో జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులు కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు అఖిలభారత మహాసభల్లో దేశంలోనీ 1000 మంది పైగా అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొంటున్నారని ఆయా రాష్ట్రాల్లో ఉన్న రైతు ప్రతినిధులు పాల్గొంటున్నారని వారు గుర్తు చేశారు. రాష్ట్రాలలో ఉన్న రైతు సమస్య లు వ్యవసాయ రంగంలో సమస్యలు దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు పలు రకాల సమస్యలపై ఈ మహాసభల్లో చర్చించడం జరుగుతుందని వారు అన్నారు భారతదేశంలోనే అతిపెద్ద రైతు సంఘం అఖిలభారత కిసాన్ సభ కొనసాగుతుందని అన్నారు తెలంగాణ రాష్ట్రంలో అఖిలభారత మహాసభ 36వ మహాసభలు నల్లగొండ పట్టణంలో జరగడం ఒక చరిత్రత్మక మనీ వారు అన్నారు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరిగిన గడ్డమీద అఖిల భారత మహాసభలు జరగడం భవిష్యత్తులో దేశవ్యాప్తంగా రైతు సంఘ ఉద్యమాన్ని కి బలోపేతం చేయడానికి నిర్వహిస్తున్నామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహకార దర్శి వర్ధశే సైదులు ప్రజా సంఘాల జిల్లా నాయకులు ఎస్ మల్లేష్ శంకర్ నాయక్ వ్యవసాయ కార్మిక సంఘం నాగరాజు రాములు తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్ ఫార్మర్ పగులగొట్టి.. కాపర్ వైర్లు చోరీ నిందితులు అదుపులోకి

- చెల్లెపాడు రైతుల అప్రమత్తతతో కాపర్ వైర్ల చోరీ గుట్టురట్టు

-700 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే లిఫ్ట్ ఇరిగేషన్









చిన్నంబావి, నవంబర్ 02 (ప్రజా జ్యోతి)

చిన్నంబావి మండల పరిధిలోని చెల్లెపాడు ఎత్తిపోతల పథకం వద్ద కాపర్ వైర్ల చోరీ ఘటన కలకలం రేపింది. రాత్రివేళ పంట పొలాలకు నీరు పారిస్తున్న రైతుల అప్రమత్తతతో చోరీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కాపర్ వైర్లు చోరీ చేస్తున్న దుండగులను గుర్తించిన గ్రామస్తులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా, నిందితులు అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అప్రమత్తమైన పోలీసులు రంగంలోకి దిగి వెల్టూరు--చిన్నమారు రహదారి సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితులు జటప్రోల్ గ్రామానికి చెందిన వారిగా గుర్తించినట్లు సమాచారం. చోరీకి గురైన కాపర్ వైర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.చెల్లెపాడు, అయ్యవారిపల్లి, కాలూరు గ్రామాలకు చెందిన 700 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేదన్నారు.

ఇనప రాడ్ల శబ్దం విని అప్రమత్తమైన రైతులు

చెల్లెపాడు గ్రామానికి చెందిన రైతులు ఆదివారం రాత్రి పంట పొలాలకు నీరు పారిస్తున్న సమయంలో లిఫ్ట్ ఇరిగేషన్ సమీపంలో ఇనుప వస్తువులు కదిలిస్తున్న శబ్దం వినిపించింది. దీంతో అనుమానం వచ్చిన రైతులు అక్కడికి వెళ్లి పరిశీలించగా, కాపర్ వైర్లు చోరీ చేస్తున్న వ్యక్తులు కనిపించారు. వారిని పట్టుకునేందుకు ప్రయత్నించడంతో నిందితులు తప్పించుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. రైతుల అప్రమత్తతతో చోరీ ఘటన వెలుగులోకి రావడంతో పాటు నిందితులను పట్టుకోవడంలో కీలకంగా మారింది.16 ఏళ్లుగా.నిరుపయోగంలో లిఫ్ట్ ఇరిగేషన్..చెల్లెపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం దాదాపు 20 సంవత్సరాలుగా వినియోగంలో లేకుండా ఉంది. ఇటీవల మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.47 లక్షలు మంజూరు చేసినప్పటికీ, పనులు ప్రారంభం కాకపోవడంతో పథకం నిరుపయోగంగానే ఉందని రైతులు తెలిపారు.



వరుస చోరీలతో రైతుల్లో కలవరం

మూడు నెలల క్రితం చిన్నమారు ఎత్తిపోతల పథకం ఫేజ్-2 వద్ద కూడా కాపర్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఆ ఘటన మరువకముందే చెల్లెపాడు ఎత్తిపోతల పథకం వద్ద మరో చోరీ వెలుగులోకి రావడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఎత్తిపోతల పథకాల వద్ద కాపర్ వైర్ల చోరీలు పునరావృతమవుతుండటంతో సాగునీటి వ్యవస్థకు భద్రత కరువైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఎత్తిపోతల పథకాల వద్ద పోలీసు నిఘా పెంచి, రాత్రివేళల్లో గస్తీ నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.కేసు నమోదు.. దర్యాప్తుఈ ఘటనపై అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జాహువా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామన్ గౌడ్ తెలిపారు. ఎత్తిపోతల పథకాలకు నష్టం కలిగిస్తూ రైతులకు ఇబ్బందులు కలిగించే చోరీలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చిన్నంబావి మండల ప్రజావాణి కి ఒకే దరఖాస్తు...

చిన్నంబావి, నవంబర్ 02 (ప్రజా జ్యోతి)

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వారం వారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమానికి స్పందన తగ్గింది. చిన్నంబావి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కేవలం ఒకే దరఖాస్తు అందింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుర్ణ ఆదర్శ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి గతంలో మాదిరిగా వినతులు రాకపోవడం గమనార్హం. ఈ ప్రజావాణిలో కేవలం ఒక దరఖాస్తు మాత్రమే అందినట్లు ఎంపీడీవో వెల్లడించారు. ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి..ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు హాజరవుతున్నందున ప్రజా సమస్యల పరిష్కారానికి ఇది చక్కని వేదిక అని ఎంపీడీవో పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ రామస్వామి, ఏపీఓ ధనుంజయ రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నర్వలో బీసీఏ కులాల సమైక్య పోరాటం ధర్నా

నర్వ నవంబర్ 2 ప్రజా జ్యోతి

నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలో సోమవారం బీసీఏ కులాల సమైక్య పోరాట ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు, ఈ సందర్భంగా నర్వ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో బీసీఏ కులాల సంబంధించిన చాకలి, బోయ, మంగలి, వడ్డెర, మేదర, తదితర ఏ కులాలకు సంబంధించిన అణగారిన కులాల కుల సంఘాల సభ్యులంతా కలిసికట్టుగా ఉండా అలానే డిమాండ్ చేస్తూ ముదిరాజ్ కులాన్ని బి సి డి నుండి బీసీఏకు మార్చా అలానే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ, ఈ ధర్నా ను





చేపట్టామన్నారు, సంబంధించిన మన రిజర్వేషన్ ఫలాలు అందేలా ప్రభుత్వంతో పోరాటం చేసి చట్టబద్ధత కల్పించుకోవాలని డిమాండ్ చేశారు, అనంతరం ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీతో వెళ్లి అక్కడ ప్రజావాణి అధికారి అయిన ఎంపీడీవో శ్రీనివాసులు తాసిల్దార్ మల్లారెడ్డి లకు వీళ్ళ డిమాండ్ల వినతిపత్రం అందజేశారు, ఈ కార్యక్రమంలో బీసీఏ కులాలకు సంబంధించిన సంఘ నాయకులు, ముందెకోడు గ్రామ సర్పంచ్ జగన్నాథం, మాజీ ఎంపిటిసి నీరాజ్ కుమార్, గడ్డం నరసింహ, మాజీ ఎంపీటీసీ అయ్యన్న, బోలుబండ శివ, బొజ్జన్న, ఆయా గ్రామాల బీసీ ఏ కులాల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణికి డుమ్మా కొడితే చర్యలు తప్పవు!


- ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు

- ప్రజల కోసం నిర్వహించే కార్యక్రమంపై నిర్లక్ష్యమా? జిల్లా కలెక్టర్‌కు సంజాయిషీ ఇవ్వాల్సిందే: అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



మహబూబ్‌నగర్, నవంబర్ 2 (ప్రజా జ్యోతి బ్యూరో):

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటికి పరిష్కారం చూపాల్సిన ప్రజావాణి కార్యక్రమానికే అధికారులు గైర్హాజరు కావడంపై జిల్లా యంత్రాంగం తీవ్రంగా స్పందించింది. ముందస్తు అనుమతి లేకుండా ప్రజావాణికి హాజరుకాని జిల్లా అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అయితే కొంతమంది జిల్లా అధికారులు ముందస్తు అనుమతి లేకుండా ఉదయం 11 గంటల వరకు కూడా హాజరుకాకపోవడాన్ని అదనపు కలెక్టర్ గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో ప్రజలు ప్రజావాణికి వస్తారని, అలాంటి సమయంలో అధికారులు అందుబాటులో లేకపోవడం సమంజసం కాదన్నారు. ప్రజలు అధికారుల కోసం వేచి చూసే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజావాణికి ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైన అధికారులు తమ గైర్హాజరుపై జిల్లా కలెక్టర్‌కు స్వయంగా సంజాయిషీ సమర్పించాలని ఆదేశించారు. ప్రజావాణి అనేది సాధారణ సమావేశం కాదని, ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత



ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమని గుర్తుచేశారు.ప్రజల నుంచి అందే ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి పెండింగ్ ఫిర్యాదులపై అదనపు కలెక్టర్ ఆగ్రహం!

- వచ్చే ప్రజావాణి నాటికి పెండింగ్ దరఖాస్తులు

'జీరో' కావాలి.. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు!

- 99 ఫిర్యాదుల స్వీకరణ.. అధికారుల పనితీరుపై సమీక్ష..

తుఫాన్, ఎల్‌నినో ప్రభావాలపై ముందస్తు చర్యలకు ఆదేశాలు





మహబూబ్‌నగర్, నవంబర్ 2 (ప్రజా జ్యోతి బ్యూరో):

ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తూ ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచే అధికారులపై ఇక ఉపేక్షించేది లేదని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకొని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, వచ్చే ప్రజావాణి నాటికి పెండింగ్ దరఖాస్తుల సంఖ్యను సున్నాకు తీసుకురావాలని జిల్లా, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఓపికగా వింటూ, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి మొత్తం 99 ఫిర్యాదులు స్వీకరించారు.

పెండింగ్ ఫిర్యాదుల లెక్కలు ఇవే.. అధికారులకు గడువు!

ప్రజావాణి అనంతరం నిర్వహించిన జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో పెండింగ్ దరఖాస్తుల వివరాలను అదనపు కలెక్టర్ వెల్లడించారు. జిల్లా స్థాయి అధికారుల వద్ద కలెక్టర్‌కు సంబంధించిన 253 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వాటిలో 121 దరఖాస్తులు 30 రోజులకు పైగా పరిష్కారం కాకుండా ఉన్నాయి. ఆర్డీఓలు, తహసీల్దార్ల వద్ద 300 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వాటిలో 174 దరఖాస్తులు నెల రోజులు దాటాయి. ఎంపీడీఓల వద్ద 18 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, తొమ్మిది దరఖాస్తులు 30 రోజులకు పైగా పరిష్కారానికి నోచుకోలేదు. ఇతర మండల స్థాయి శాఖల అధికారుల వద్ద 127, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల పరిధిలో 92 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. వీటిలో వరుసగా 95, 60 దరఖాస్తులు 30 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.

ఇప్పటికే పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ పరిధిలో లేని సమస్యలపై సంబంధిత శాఖలకు స్పష్టమైన ఎండార్స్‌మెంట్ జారీ చేయాలని, ఫిర్యాదులను బదిలీ చేసి చేతులు దులుపుకోకుండా పరిష్కారంపై బాధ్యత వహించాలని సూచించారు.

మండలాల్లో అధికారుల పనితీరుపై నిఘా!

మండల స్థాయి ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన మండలాలను సందర్శించి ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.గ్రామీణాభివృద్ధికి సంబంధించి నిర్దేశించిన 55 అంశాలపై ఎంపీడీఓలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఏపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తానని తెలిపారు. ఇకపై ఏపీడీఓలతో ప్రతిరోజూ టెలీ కాన్ఫరెన్స్ లేదా వెబ్ సమావేశాలు నిర్వహించి లక్ష్యాల సాధనపై సమీక్షిస్తానని వెల్లడించారు.కేవలం క్షేత్రస్థాయి పర్యటనల ఫొటోలు పంపితే సరిపోదని, క్షేత్రస్థాయిలో వాస్తవ పనులు పూర్తిచేసి ఫలితాలు చూపించాలని స్పష్టం చేశారు.

ఎల్‌నినో ముప్పు.. నీటి సంరక్షణకు ముందస్తు ప్రణాళిక!

భవిష్యత్తులో ఎల్‌నినో ప్రభావంతో తాగునీరు, పశువులకు నీటి కొరత తలెత్తకుండా ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్లు, నీటి కుంటలను యుద్ధ ప్రాతిపదికన నిర్మించి నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పశువులకు పచ్చిమేత పెంపకాన్ని ప్రోత్సహించడంతో పాటు గతంలో నిర్మించిన పశువుల నీటి తొట్టెలకు మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన చోట కొత్త తొట్టెల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పశుసంవర్ధక శాఖ అధికారులకు సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి!

ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు పంపించడంతో సరిపెట్టకుండా మంజూరైన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సాయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, వార్డు సభ్యులు, గృహ నిర్మాణ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో గుడిసెలు లేకుండా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించేందుకు చొరవ చూపాలని అన్నారు.

మురుసు తుఫాన్ హెచ్చరిక.. రైతులు అప్రమత్తంగా ఉండాలి!

మురుసు తుఫాన్ ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ సూచించారు.గతంలో వరదలతో ఇబ్బందులు ఎదురైన లోతట్టు ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, కాజ్‌వేలపై నీరు ఉధృతంగా ప్రవహించే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రాణ, పశు, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.ముఖ్యంగా నవంబర్ 3, 4 తేదీల్లో రైతులు పంట కోతలు చేపట్టవద్దని వ్యవసాయ శాఖ అధికారులు సూచించాలని తెలిపారు. ఇప్పటికే కోసిన పంటలను ఎత్తైన, నీరు నిల్వ ఉండని ప్రాంతాల్లో టార్పాలిన్లతో కప్పి భద్రపరుచుకోవాలని సూచించారు. ఈదురు గాలులు, పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున రైతులు చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

బ్యాక్‌లాగ్ ఖాళీల వివరాలు వెంటనే ఇవ్వాలి!

రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖల్లో ఉన్న బ్యాక్‌లాగ్ ఖాళీల వివరాలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 78 శాఖలకు సంబంధించిన వివరాలు కోరగా ఇప్పటివరకు 36 శాఖల నుంచి మాత్రమే ధ్రువీకరణ సమాచారం అందిందని, మరో 42 శాఖల నుంచి సమాచారం రావాల్సి ఉందని తెలిపారు. సిబ్బంది వివరాలు, ఖాళీల స్థితిగతులు, రోస్టర్ పాయింట్లను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నివేదికలు పంపాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, డీఆర్వో ఎ. నిర్మల, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ యాదగిరి, జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకటరెడ్డి, డీఆర్డీఓ నర్సింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ముప్పుపై విద్యార్థులకు అవగాహన..

జిల్లాలోని 1,108 పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు!

- నీటి పొదుపు.. పర్యావరణ పరిరక్షణపై చిన్నారులకు పాఠాలు

-- కలెక్టర్ ఆదేశాలతో విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ





మహబూబ్‌నగర్, నవంబర్ 2 (ప్రజా జ్యోతి బ్యూరో):

వాతావరణ మార్పులు.. ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో విద్యార్థుల్లో ముందస్తు అవగాహన కల్పించేందుకు మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా 1,108 ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం ఉదయం ప్రార్థనా సమయంలో ఎల్‌నినో ప్రభావాలు, వాతావరణ మార్పులు, వాటిని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎండ తీవ్రత పెరగడం, వర్షపాతంలో మార్పులు, నీటి కొరత వంటి పరిణామాల గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించడం, శరీరానికి సరిపడా నీరు తాగడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించడం వంటి అంశాలను తెలియజేశారు.

విద్యార్థులతో మాట్లాడిన డీఈఓ విజయకుమారి

జిల్లాలోని అన్ని మండలాల్లో మండల విద్యాశాఖ అధికారుల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి రాజాపూర్ మండల కేంద్రంలోని ఓ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఉదయం ప్రార్థనా సమయంలో విద్యార్థులతో ముచ్చటించి ఎల్‌నినో ప్రభావాలు, వాతావరణ మార్పులపై అవగాహన కల్పించారు. అనంతరం కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణ, నీటి పొదుపు, వాతావరణ మార్పులపై విద్యార్థులకు మరింత అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

మోడల్ బేసిక్ పాఠశాలలో అవగాహన

మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ విద్యార్థులకు ఎల్‌నినో ప్రభావాలు, వాటిని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల నుంచి కుటుంబాలకు.. సమాజానికి సందేశం!

విద్యార్థులకు కల్పించిన అవగాహన వారి కుటుంబాలకు, తద్వారా సమాజమంతటికీ విస్తరించాలన్న లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాలను నిర్వహించారు. వాతావరణ మార్పులను అర్థం చేసుకోవడం, నీటి వనరులను సంరక్షించడం, పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని విద్యాశాఖ అధికారులు సూచించారు.

మాజీ సైనికులకు శుభవార్త..

నవంబర్ 5న మహబూబ్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం!

- పెన్షన్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అవకాశం.. ఒకే వేదికపై సైనిక సంక్షేమ అధికారులు, వైద్య బృందం

మహబూబ్‌నగర్, నవంబర్ 2 (ప్రజా జ్యోతి బ్యూరో):

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మాజీ సైనికులు, మాజీ సైనిక వితంతువులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు శుభవార్త. వారి సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణతో పాటు పెన్షన్ సంబంధిత సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నవంబర్ 5వ తేదీన మహబూబ్‌నగర్‌లో ప్రత్యేక మాజీ సైనిక అవగాహన సదస్సుతో పాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. హైదరాబాద్ సైనిక సంక్షేమ శాఖ సంచాలకులు బ్రిగేడియర్ ఎన్.ఆర్. బాబు (రిటైర్డ్) ఆధ్వర్యంలో, ఆర్టిలరీ రికార్డ్స్, గోల్కొండతో పాటు వివిధ సైనిక రికార్డుల విభాగాలకు చెందిన అధికారులు, జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ప్రతినిధులు, వారి బృందం ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. నవంబర్ 5న ఉదయం 9 గంటలకు ప్రారంభంమహబూబ్‌నగర్ పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఉన్న రాజబహదూర్ వి.ఆర్. రెడ్డి కమ్యూనిటీ హాల్‌లో నవంబర్ 5, 2026 (గురువారం) ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

ఓఆర్ఓపీ-III పెన్షన్ సమస్యలకు పరిష్కారం

మాజీ సైనికులకు పెన్షన్ చెల్లింపుల్లో ఎదురవుతున్న సమస్యలు, ఓఆర్ఓపీ-III సంబంధించిన సందేహాలు, ఇతర సైనిక సంక్షేమ అంశాలపై సంబంధిత అధికారులను నేరుగా కలిసి తమ సమస్యలను వివరించే అవకాశం కల్పిస్తున్నారు. అర్హత, రికార్డులు, పెన్షన్ సంబంధిత అంశాలపై అధికారుల నుంచి అవసరమైన మార్గదర్శకాలు పొందవచ్చు.అదేవిధంగా ఉచిత వైద్య శిబిరం ద్వారా వైద్య సేవలు పొందే అవకాశం కూడా కల్పిస్తున్నారు.

ఐదు జిల్లాల మాజీ సైనికులకు ఆహ్వానం

మహబూబ్‌నగర్‌తో పాటు వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందిన మాజీ సైనికులు, మాజీ సైనిక వితంతువులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి ఏ. శ్రీనివాస్ రెడ్డి కోరారు.దేశ రక్షణ కోసం సేవలందించిన మాజీ సైనికుల సంక్షేమానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమానికి సంబంధిత వారందరూ హాజరై వైద్య సేవలతో పాటు పెన్షన్ సమస్యల పరిష్కారానికి అందిస్తున్న అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్య తోనే ఉజ్వల భవిష్యత్తు.....

మహమ్మదాబాద్ అక్టోబర్ 2(ప్రజా జ్యోతి)

పాలమూరు యూనివర్సిటీ ఎన్ ఎస్ ఎస్ స్పెషల్ యూనిట్ -6 ఆధ్వర్యంలో మహమ్మాదాబాద్ లో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం లో భాగంగా సోమవారం గ్రామ సర్పంచ్ విద్యార్థులనుద్దేశించి ప్రేరణార్థక ప్రసంగం చేశారు. కష్టపడి చదివి జీవితం లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, కఠిన పరిస్థితులేదురైనా ఆత్మ విశ్వాసం కోల్పోవద్దని సూచించారు. తమ గ్రామం లో సేవలు చేస్తున్నందుకు సంతోషం గా ఉందని నైపుణ్యం, జ్ఞానం ఉంటే ఎక్కడైనా గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు.విద్యార్థులు ఇంటింటా సర్వే నిర్వహించి ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యుల వివరాల సేకరణ లో భాగంగా కుటుంబం లో చదువుకున్న వాళ్ళ వివరాల తో పాటు, నిరుద్యోగ, స్వయం ఉపాధి పొందుతున్న వారి వివరాలు సేకరించి గ్రామీణ జీవన విధానాన్ని ప్రా ముఖ్యతను చాటి చెప్పారు.



అక్షర సేవకు విరమణ..... ఘనంగా అభినందన సభ

మహమ్మదాబాద్ అక్టోబర్ 2 (ప్రజా జ్యోతి)

విద్యాబోధనతో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసి అక్షరం అందించిన ఆదర్శ ఉపాధ్యాయుడు కుక్కల భీమయ్య పదవి విరమణ సందర్భంగా అభినందన సభ సోమవారం చిన్నాయపల్లి గ్రామంలో ఎస్ డబ్ల్యూ ప్రాథమిక పాఠశాలలో ఘణంగా జరిగింది.ఉపాధ్యాయుడుగా తన అమూల్యమైన సేవలతో ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపు తున్న భీమయ్య సేవలను స్మరించుకుంటూ ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయుడు భీమయ్య దంపతుల శేష జీవితం సుఖ సంతోషాల తో కొన సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చిన్నయపల్లి సర్పంచ్, మహమ్మదాబాద్ మండల విద్యాధికారి రాజు నాయక్,గండీడ్ మండల విద్యాధికారి జనార్ధన్,మాజీ ఎం పి పి శాంతి రంగ్యా,మాజీ, తాజా ప్రజా ప్రతినిధులు ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థుల పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



తెప్ప శ్రీనివాస్ కు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రశంసా పత్రం అందజేసిన మంత్రి వాకిటి శ్రీహరి

- మార్షల్ ఆర్ట్స్ ద్వార సంపూర్ణ ఆరోగ్యం - తెప్ప శ్రీనివాస్ సేవలు అభినందనీయం

- రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



నాగర్ కర్నూల్ : నవంబర్ 02 (ప్రజా జ్యోతి)

తైక్వాండో అసోసియేషన్ న్నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్.తెప్ప శ్రీనివాస్ (ముదిరాజ్) కు తెలంగాణ రాష్ట్ర క్రీడలు మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రశంసా పత్రం,మెడల్ అందచేసారు.సోమవారం హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వాటర్స్ లోని మినిస్టర్ ఛాంబర్ లో డాక్టర్.తెప్ప శ్రీనివాస్(ముదిరాజ్)ను మంత్రి వాకిటి శ్రీహరి ఘనంగా సన్మానించి, సత్కరించారు.ఆగష్టు 9న,హైదరాబాద్ లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన తైక్వాండో పోటీలో అత్యంత ప్రతిభచూపి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించినందుకు క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మెడల్ తో సన్మానించి,ప్రశంసా పత్రం అందచేసారు. గత 35 సంవత్సరాలుగా మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీస్ చేస్తూ, తైక్వాండో అసోసియేషన్ నాగర్ కర్నూల్ అధ్యక్షుడిగా ఉంటూ అనేక మంది యువతకు ఆదర్శంగా ఉంటూ 55 సంవత్సరాల వయస్సులో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడంతో పాటు గత 16 సంవత్సరాలుగా లైన్స్ క్లబ్,మరియు సేవా ఫౌండేషన్ ద్వారా సేవలు అందిస్తున్నందుకుగాను లయన్ తెప్ప శ్రీనివాస్ ను ప్రశంసించారు.ఈ సందర్భంగా మంత్రిశ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రోత్సాహం ఇస్తుందని,ఈ ప్రోత్సాహాన్ని యువత సద్వినియోగం చేసుకొని క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ ద్వారా ఆరోగ్యంగా ఉంటామని,ప్రతి రోజు ఒకగంట వ్యాయామం చేయాలని యువతకు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు,జిల్లా డైరెక్టర్ తెప్ప బాబు,నాగనూలు సొసైటీ అధ్యక్షుడు తిరుపతయ్య,కాంగ్రెస్ నాయకులు,కేసరి సముద్రం సొసైటీ సభ్యులు తవిటి నిరంజన్,తెప్ప రుద్రయ్య,తెప్పరాజేందర్ లు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.అంతేగాక తైక్వాండో అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ మాస్టర్ రవి,జిల్లా ట్రెజరర్ మాస్టర్ స్వాతి,విద్యార్థులు అభినందించారు.

పట్టభద్రుల ఓటుతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి!

- విద్యావంతులు, నిరుద్యోగులు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు -- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

- నవంబర్ 6లోగా గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోండి..

గతంలో ఓటు వేసిన వారు సైతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి



మహబూబ్‌నగర్, నవంబర్ 2

(ప్రజా జ్యోతి బ్యూరో):

రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు, నిరుద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకుని కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెప్పాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు వి. శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పలు విద్యాసంస్థల్లో నిర్వహించిన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులు, యువతకు ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులు, విద్యార్థులకు ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్నీ సక్రమంగా అమలు చేయలేదని, ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. దీంతో విద్యావంతులు, నిరుద్యోగులు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వ్యాఖ్యానించారు.

హామీలు ఏమయ్యాయి..? నిరుద్యోగుల ప్రశ్నలకు సమాధానం ఏది?

విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు సరైన అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో విద్యావంతులు తమ ఓటు ద్వారా ప్రభుత్వానికి సమాధానం చెప్పాలని కోరారు.

వితెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారంటూ విమర్శలు

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలనుల మోసం చేసిందని ఆరోపించిన శ్రీనివాస్ గౌడ్, రాష్ట్రంలోని సాగునీటి ప్రయోజనాల విషయంలోనూ ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌కు నీటిని తరలించేందుకు



తెలంగాణ రైతుల పంటలను ఎండబెడుతున్నారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

నవంబర్ 6 చివరి తేదీ.. పట్టభద్రులంతా ఓటరుగా నమోదు కావాలి

పట్టభద్రుల ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడానికి నవంబర్ 6 చివరి తేదీ అని పేర్కొంటూ, అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ఎన్నికల్లో పట్టభద్రుల ఓటు హక్కును వినియోగించుకున్న వారు సైతం ఈసారి మళ్లీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం డిగ్రీ ధ్రువపత్రం, ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్ ప్రతులపై గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ చేయించి స్థానిక ఎంఆర్ఓ కార్యాలయంలో అందజేయాలని వివరించారు.

బీఆర్ఎస్ శ్రేణుల భాగస్వామ్యం

ఈ ఓటరు నమోదు కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యా నాయక్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, కార్పొరేటర్లు శరత్, ఈశ్వరయ్య, మధుమోహన్, నవకాంత్, సీనియర్ నాయకులు జహంగీర్, శ్రీనివాస్ రెడ్డి, క్రాంతి, ఇమ్రాన్, సుధాకర్, సాదిక్, బీఆర్ఎస్వీ నాయకులు శివకుమార్, నవీన్ రాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.